క్లుప్తంగా

గణితం నిత్య జీవితంలో భాగం

టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం



గణిత ప్రాజెక్టులను తిలకిస్తున్న పీసీసీ సభ్యుడు దరిపల్లిచంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నిత్య జీవితంలో గణితం ఒక భాగమని, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం అన్నారు. జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని సహస్త పాఠశాలలో గణిత ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దరిపల్లి చంద్ర హాజరయి మాట్లాడుతూ శ్రీనివాసరామానుజన్ గణిత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శాంతికిరణ్, డైరెక్టర్ హారిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా నూతన కమిటీ నియామకం



జిల్లా చేనేత ఐక్యవేదిక నూతన కమిటీ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చేనేత ఐక్యవేదిక జిల్లా నూతన కమిటీని నియమించారు. శనివారం మార్కండేయ ఆలయంలో రాష్ట్ర చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు గాజుల భగవాన్, జిల్లా అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుబత్తిని రాము, జిల్లా ప్రచార కార్యదర్శిగా సిరిగాది బాలరాజు, కోశాధికారిగా ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా చేర్యాల మల్లికార్జున్, సిరిసిల్ల బాలకిషన్, ఎల్లారం రమేశ్, పత్తిపాక రాములు, సహాయ కార్యదర్శులుగా వంగరి నాగరాజు, పాము రాజన్న, అరగొండ మల్లేశం, గోలి శ్రీనివాస్, చిప్ప శోభన్ బాబు, జిల్లా కార్యదర్శులుగా వెల్దండి భాస్కర్, మచ్చ పురుషోత్తం, పేర్ల రమేష్, ముదిగొండ శ్రీనివాస్, చిలుక ఆంజనేయులును నియమించారు. నూతన కమిటీ సభ్యులు ఈ నెల 29న నగరంలో ప్రమాణ స్వీకరం చేయనున్నట్లు ముదిగొండ శ్రీనివాస్ తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని బీజీ వెంకటాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నాయక్ పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించిన సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం సమావేశమయ్యారు. పిల్లల తల్లిదండ్రులు తయారు చేసుకొచ్చిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పిల్లల ఎదుగుదల, తెలివితేటలు పౌష్టికాహారంతోనే సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, అవగన్‌వాడి టీచర్, ఆశావర్కర్ పాల్గొన్నారు.

టీసీఏ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

గజ్వేల్‌రూరల్: టీసీఏ (తెలంగాణ క్రికెట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టీసీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి, వెస్ట్‌జోన్ ఇన్‌చార్జి హరిశ్చంద్రప్రసాద్‌లు శనివారం విలేకరులతో పేర్కొన్నారు. ఆసక్తిగల జట్లు జనవరి 5లోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ టోర్నీలో 32 జట్లకు మాత్రమే పాల్గొనే అవకాశముందని వివరించారు. విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు రూ.25వేల నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. 8501929739, 7780596892 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న మల్లన్న కల్యాణ ఏర్పాట్లు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి కల్యాణం ఈనెల 29న జరగనుండటంతో ఆలయ అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శనివారం ఆలయ పరిసరాలతో పాటు స్వామి రాజగోపురాన్ని నీటితో కడిగి శుద్ధి చేశారు. కల్యాణం జరిగే తోట బావి ప్రాంతంలో మట్టితో చదును చేశారు.





పసువుల పాకలో ఏసు...



క్రిస్మస్ ట్రీ

క్రిస్మస్ శోభ

జిల్లా అంతటా క్రిస్మస్ శోభ సంతరించుకుంది.. చర్చిలన్నీ విద్యుద్దీప కాంతులతో కళకళలాడుతున్నాయి.. క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్‌లు, స్టార్లతో సుందరంగా అలకరించారు.. బుధవారం పండుగను నిర్వహించుకునేందుకు క్రైస్తవులు సిద్ధమవుతున్నారు.. జిల్లాలో సుమారు వెయ్యి వరకు చర్చిలున్నాయి. క్రిస్మస్ రోజు ఉదయం నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.. జిల్లా కేంద్రంలోని పురాతన సీఎస్ఐ చర్చిలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఇలా ముస్తాబు చేశారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



పట్టణంలోని సీఎస్ఐ చర్చికి విద్యుత్ దీపాలంకరణ...

స్వచ్ఛ బడిలో రైతు దినోత్సవం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక స్వచ్ఛ బడిలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ రైతు ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దీప్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక పూజలు

మిరుదొడ్డి(దుబ్బాక): చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన మిరుదొడ్డిలో నిర్వహిస్తున్న గీతా పారాయణంలో భాగంగా శనివారం భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. 11వ అధ్యాయం ముగింపు సందర్భంగా శ్రీ కృష్ణుడు విశ్వరూపం ఇవ్వడంతో స్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. వైదిక నిర్వాహకులు చంద్రశేఖర శర్మ, చిన్మయ మిషన్ ప్రతినిధి నర్సింహులు, శ్రీనివాస్ రెడ్డి, గజి బింకార్ బాల్‌రాజు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు ధ్యానం చేయాలి

హుస్నాబాద్: ప్రతీఒక్కరు ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని ధర్మవీర్ యోగా శిక్షణ గురువు అయిలేని అనిత అన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని ధర్మవీర్ యోగా శిక్షణ శిబిరంలో మహిళలు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. ధ్యానం ప్రాధాన్యాన్ని ప్రతీఒక్కరు తెలుసుకోవాలన్నారు. ధ్యానం మానసిక ఒత్తిడిని దూరం చేస్తోందన్నారు. ధ్యానం భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవన వారసత్వమన్నారు. వేదకాలం నుంచి మనుషుల్లో అంతర్గత వికాసానికి, ఆత్మసాక్షాత్కారానికి ధ్యానం ఒక సాధన అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వాల సుప్రజ, బోజు రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఘనంగా ధ్యాన దినోత్సవం సంబరాలను నిర్వహించారు. జగదేవ్‌పూర్‌లోని శ్రీ చైతన్య, మాస్టర్ మైండ్, అక్షర, అలిరాజ్‌పేటలో సెంట్ విన్సెంట్, పలు ప్రభుత్వ పాఠశాలలో ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: ధ్యానం చేస్తున్న మహిళలు



తొగుట: యోగా చేస్తున్న పోలీసులు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

తొగుట(దుబ్బాక): విధి నిర్వహణలో పోలీసులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, యోగా, ధ్యానంతో ఒత్తిడిని దూరం చేసుకోవచ్చునని తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్ సూచించారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా తొగుట పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి శనివారం యో గా, ధాన్యం చేశారు. కార్యక్రమంలో తొగుట, బేగంపేట, కుకునూరుపల్లి ఎస్ఐలు రవికాంత్‌రా వు, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించండి

- విద్యార్థినుల తల్లిదండ్రుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

మిరుదొడ్డి(దుబ్బాక): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాయలం (కేజీబీవీ)లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈమేరకు మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం బైఠాయించి ఆందోళనకు దిగారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ హరికిషన్‌కు అందజేశారు. వీరి ఆందోళనకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్ మొగుళ్ళ ఐలయ్య, రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్యలు సంఘీభావం తెలిపారు. ఈ సదర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థులకు బోధించే టీచర్లు సమ్మె బాట పట్టడంతో విద్యా బోధన కుంటుపడుతోందని అసహనం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులపై కాలం చెల్లిన ఫ్యాన్లు విరిగి పడి గాయాల పాలవుతున్నా పట్టించుకునే అధికారులు లేరని మండిపడ్డారు. ఇటు బోధించే వారు లేక, అటు నాణ్యమైన భోజనాన్ని అందించే వారు లేక హాస్టల్‌లో విద్యార్థులు ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కేజీబీవీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన విద్యార్థిని తల్లిదండ్రులు

అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యత



హుస్నాబాద్: క్రిస్‌మస్ కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: తెలంగాణలో సర్వ మతాల పండుగలకు సమాన ప్రాధాన్యత ఉంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి తెలిపారు. పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో శనివారం సెమీ క్రిస్‌మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్ని మతాల పండుగలను కలిసికట్టుగా జరుపుకొనే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదన్నారు. ముందుగా వెల్కమ్ పాటతో చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు కొంకట నళినిదేవి, చిత్తారి పద్మ, వల్లపు రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సూచించారు. శనివారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మరో నెల రోజుల్లోగా పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తికి చర్యలు చేపట్టాల్సిన అవసరముందన్నారు. స్వచ్ఛతలో పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి జరగాలన్నారు. మున్సిపల్‌లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు.



గజ్వేల్: మాట్లాడుతున్న చైర్మన్ రాజమౌళి

క్రీడల్లో గెలుపోటములు సహజం

గజ్వేల్‌రూరల్: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటమి ఎదురైందని క్రీడాకారులు నిరాశ చెందకూడదని విజయం సాధించేంతవరకూ విశ్రమించకూడదని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు ఏఎంసీ వైస్‌చైర్మన్ జకియొద్దీన్‌తో కలిసి బహుమతులు ప్రదానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని 11కేవీ నాగదేవత ఆలయ ఫీడర్, 11కేవీ కరీంనగర్ రోడ్డు ఫీడర్‌ల పరిధిలో లైన్ల కింద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. నసీర్‌నగర్, కప్పలకుంట, గ్రీన్ కాలనీ, సీతారాంనగర్, హరీశ్‌రావునగర్, గాడిచెర్లపల్లి, నాగదేవత ఆలయం ఎక్స్‌రోడ్డు, కరీంనగర్ రోడ్డు, వడ్డెర కాలనీ, సూడా చౌరస్తా, తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జగదేవ్‌పూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నరేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లోకి రాకముందు తానుకూడా జర్నలిస్టుగా పనిచేశానన్నారు. జగదేవ్‌పూర్ మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



అంతిమయాత్రలో కూతురు నందిని

మిరుదొడ్డి(దుబ్బాక): గుండెపోటుతో తండ్రి మృతి చెందగా కూతురు తలకొరివి పెట్టిన విషాదకర ఘటన మండల పరిధిలోని అందెలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కరాడి నాగరాజు (55) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ భార్య నర్సవ్వ, ఒక్కగానొక్క కూతురు నందిని పోషించుకుంటున్నాడు. శనివారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి వస్తుందంటూ కుప్పకూలిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి కుమారులు లేక పోవడంతో కూతురు నందిని అన్నీ తానై తలకొరివి పెట్టింది.

గ్యాస్ ఏజెన్సీల లైసెన్స్‌లు రద్దు చేయాలి

హుస్నాబాద్: ప్రభుత్వం ద్వారా పేదలకు ఇవ్వాల్సిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు అమ్ముకుంటున్న గ్యాస్ ఏజెన్సీల లైసెన్స్‌లను రద్దు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కన్నపేట మండలానికి చెందిన గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. తమ మండలంలోని హుస్నాబాద్‌తో పాటు వివిధ గ్రామాల్లో సిలిండర్ పై రూ.100లను అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. పేదలకు ఉచితంగా ఇవ్వాల్సిన ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌కు రూ.2వేల చొప్పున అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అక్రమ దందాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రవీందర్ గౌడ్ డిమాండ్ చేశాడు. సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు వెల్పుల రాజు నాయకులు శంకర్, సుధాకర్, హన్మంతులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు**



అక్కన్నపేట(హుస్నాబాద్): నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తే రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా అన్నారు. అక్కన్నపేటలో ఆయిల్ పామ్ సాగు తోటకు వెళ్లి, అనంతరం రైతుల వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పామ్ తోటలకు చీడపీడలు సోకే ఆస్కారం తక్కువ అన్నారు. మొక్కలు నాటిన నాలుగేళ్ల అనంతరం ఏటా ఎకరానికి 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్ల వరకు ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే పంట మొదలైనప్పటి నుంచి 30 ఏళ్ల పాటు రైతు దిగుబడి పొందుతాడన్నారు. కేవలం నీరు పెట్టి పైపాటు ఎరువులు వేస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ బాలాజీ, ఏఈఓ చంద్రప్రకాశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

◆ **వ్యక్తిగత రక్షణకే కరాటే**

కోహెడ(హుస్నాబాద్): కరాటే వ్యక్తిగత రక్షణకు ఉపయోగపడుతుందని, విద్యార్థి దశ నుంచే ఈ కళను నేర్చుకోవాలని ఎస్ఐ అభిలాశ్ అన్నారు. స్థానిక శ్రీఆదర్శ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎస్ఐ హాజరై మాట్లాడారు. కరాటేలో ప్రతిభ కనబర్చిన 22 మంది విద్యార్థులకు ఎస్ఐ చేతుల మీదుగా ఎల్లో బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలను అందించారు. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన కరాటేను గ్రామీణ స్థాయిలో తీసుకురావడంపై పాఠశాల కరస్పాండెంట్ అశోద అంజయ్యను అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో విద్యతో పాటుగా కరాటేపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోద శైలజ, కరాటే శిక్షకులు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు మానస, వంశీ, సిద్దరామప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా ఆహార దినోత్సవం**

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలంలోని కొడకండ్లలో గల ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఆహారదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తయారుచేసిన ఆహార పదార్థాలను పాఠశాలకు తీసుకువచ్చి వాటితో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆహార పదార్థాలలో ఉండే పోషకాలు, వాటి ప్రాముఖ్యతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ వివరించారు.

గజ్వేల్‌లో ఆర్ఏఎఫ్ ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

గజ్వేల్‌రూరల్: శాంతిభద్రతల పరిరక్షణే తమ కర్తవ్యమని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. భారత హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్‌లోని భాగమైన ఆర్ఏఎఫ్ (రాపిడ్ యాక్షన్ ఫోర్స్)తో శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి ఇందిరాపార్కు చౌరస్తామీదుగా కోట మైసమ్మ నుంచి పిడిచెడ్ రోడ్డు గుండా పోలీస్‌స్టేషన్ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ టీవీ బగేల్, ఇన్‌స్పెక్టర్లు హరిబాబు, మల్లేశ్వర్‌రావు, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ ఎస్ఐలు యాదవరెడ్డి, శంకర్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావద్దు

యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని గజ్వేల్ సీఐ సైదా సూచించారు. ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో మోటివేషనల్ స్పీకర్ నళినితో కలసి సైదా మాట్లాడారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాల పేరుతో క్రయవిక్రయాలు జరిపినా, వాటిని స్వీకరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్, ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ వినోద్, జనరల్ సెక్రటరీ కరుణాకర్ పాల్గొన్నారు.